www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231



తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :18 | 08-02-2021 | పుటలు : 4

## కాకినాడ క్యాంపస్‌లో బయోడైవర్సిటీ పార్క్, మ్యూజియం



డా.నలినిమోహన్ ను అభినందిస్తున్న వీసీ జగన్నాథరావు

**01.02.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్‌లో బయోడైవర్సిటీ పార్క్ మరియు మ్యూజియంను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బయోడైవర్సిటీ పార్క్, మ్యూజియంను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వైల్డ్ లైఫ్), ఏపీ బయోడైవర్సిటీ బోర్డు మెంబర్ సెక్రటరి డా.నలిని మోహన్(ఐ.ఎఫ్.ఎస్) కాకినాడ క్యాంపస్‌ను పరిశీలించారు. దీనిలో భాగంగా రాజమహేంద్ర వరంలోని నన్నయ విశ్వవిద్యాలయం ప్రధాన క్యాంపస్ లో ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును కలిసి పలు అంశాలపై చర్చించారు. సమావేశ అనంతరం వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడలో బయోడైవర్సిటీ పార్క్ అండ్ మ్యూజియంను ఏర్పాటు చేసేందుకు తీసుకువచ్చిన ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని అన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధితో పాటు జీవవైవిధ్య సంరక్షణకు పాటుపడేందుకు చక్కని అవకాశం లభించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బయోడైవర్సిటీ పార్కు అండ్ మ్యూజియంలు మూడు ప్రాంతాలలో మాత్రమే ఏర్పాటు చేస్తున్నారని దీనిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ఎంపిక చేయడం హర్షనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకొని విశ్వ విద్యాలయ అధికారులు, బోర్డు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కాకినాడ క్యాంపస్‌లో చక్కని బయోడైవర్సిటీ పార్కు అండ్ మ్యూజియం ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ జాతులకు చెందిన మొక్కలను, చెట్లను, పక్షులను పెంచడం వలన కాకినాడ క్యాంపస్ మరింత సుదరంగా తయారవుతుందని వలస పక్షులకు ఆవాసంగా రూపాంతరం చెంది ఆహ్లాదకర వాతావరణం నెలకుంటుందని తెలియజేశారు. విద్యార్థులకు పరిశోధన కేంద్రంగా, ప్రజలకు చక్కని పార్కుగా ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. జీవవైవిద్యాభివృద్ధికి, సంరక్షణకు పాటుపడుతున్న డా.నళినీమోహన్‌ను వీసీ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్, ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, డా.పద్మావతి, డా.సామ్యుల్ కుమార్, డా.కె.వి.స్వామి, డా.సుంకర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



దూరాన్ని చెరిపి వేస్తుందిలే
బారు చీమల పరుగు!

పాపాన్ని కడిగి వేస్తుందిలే
పాల నవ్వుల నురుగు!

మంచి ఏ కొంచెమైనా చాలు
మార్పు తేవాలంటే!!

- ఆచార్య సి.నారాయణరెడ్డి.

## పీజీ ప్రవేశాలకు మూడో దశ కౌన్సిలింగ్

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**02.02.21 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ ప్రవేశాలకు ఈ నెల 5వ తేదీ నుండి మూడో దశ కౌన్సిలింగ్‌ను ఆయా కళాశాలల వారు నిర్వహిస్తారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేశారు. మూడో దశ కౌన్సిలింగ్ ప్రక్రియను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లతో పాటు అనుబంధ కళాశాలల్లోనూ నిర్వహిస్తున్నారని అన్నారు. కళాశాలల్లోని సీట్లు ఖాళీల ఆధారంగా విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలల్లో కౌన్సిలింగ్‌కు హాజరై ప్రవేశాలను పొందవచ్చునన్నారు. 5,6 తేదీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈ.డబ్ల్యూ.ఎస్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు 8,9 తేదీలలో అన్ని కేటగిరీలకూ చెందిన విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరు కావచ్చునని చెప్పారు. 10,11 తేదీలలో కళాశాలల వద్ద నేరుగా ప్రవేశాలను పొందవచ్చునని, 12,13 తేదీలలో మేనేజ్మెంట్, సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లలో ప్రవేశాలను పొందవచ్చునని తెలిపారు. నన్నయ సెట్‌రాసిన విద్యార్థులకు ప్రాధాన్యతనిస్తారని చెప్పారు. మూడో దశ కౌన్సిలింగ్‌ను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకొని పీజీ ప్రవేశాలను పొందాలని సూచించారు.

## మానవ హక్కులను పరిరక్షిద్దాం

### రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్




సమావేశంలో మాట్లాడుతున్న రిజిష్ట్రార్ ఆచార్య టి.అశోక్

**04.02.21 (మీడియాసెల్)** మన హక్కులను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ అన్నారు. జాతీయ మానవహక్కుల కమిషన్ సౌజన్యంతో విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం "ప్రపంచ మానవ స్వేచ్ఛ, సమానత్వపు హక్కులు" అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డా.బి.కెజియారాణి మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లో 290 ఎన్.ఎస్.ఎస్ యూనిట్లుతో రాష్ట్రంలోనే అతిపెద్ద ఎన్.ఎస్.ఎస్ విభాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఉందని అన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో కోవిడ్ కాలంలో సమాజహితమైన అనేక కార్యక్రమాలను చేపట్టామన్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వీసీ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ప్రపంచ మానవ స్వేచ్ఛ, సమానత్వపు హక్కులను పరిరక్షించుకోవాలని అన్నారు. ప్రతిఒక్కరూ పొరుగువారితో గౌరవ మర్యాదలతో ప్రవర్తించాలని, ఇతరుల హక్కులను హరించే విధంగా ప్రవర్తించకూడదని చెప్పారు. అందరూ తమ స్వేచ్ఛ, హక్కులను ఉపయోగించుకోవడంతో పాటు ఇతరుల హక్కులకు స్వేచ్ఛకు భంగం కలుగకుండా నడుచుకోవాలని, తద్వార మానవ హక్కులు పరిరక్షించుకుని భవితరాలకు మంచి వాతావరణాన్ని అందిచగలమని తెలియజేశారు. తరువాత "మానవ హక్కులు రాజ్యాంగ రక్షణ" అనే అంశంపై ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.సుమిత్ర, "జాతీయ మానవ హక్కుల సంఘం ఏర్పాటు పనితీరు" అనే అంశంపై విట్ ఏపీ న్యాయ కళాశాల ఆచార్యులు సి.హెచ్.బెనర్జీ వివరించారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో "మహిళ వివక్షత, అంతర్జాతీయ బాలల హక్కులు" అనే అంశంపై ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి రహిమున్నిసా బేగం, "ఎస్సీ ఎస్టీ మహిళలు" అత్యాచార నిరోధకచట్టం పనితీరు" అనే అంశంపై విశాఖపట్నం మానవ హక్కుల వేదిక కన్వీనర్ వి.ఎస్.కృష్ణ వివరించారు. అనంతరం అతిథులను ఎన్.ఎస్.ఎస్. విభాగం అధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.వి.పెర్సిస్, డా.కె.రమణేశ్వరి, డా.కె.సుబ్బారావు, డీన్స్ డా.ఎ.మట్టారెడ్డి, డా.బి.జగన్మోహనరెడ్డి, ఆచార్య పి.సురేష్ వర్మ మరియు ఉభయగోదావరి జిల్లాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సాహిత్య ప్రయోజనం



‘జీవన విమర్శనమే కవిత్వం’ అంటారు మాథ్యూ ఆర్నాల్డ్. సాహిత్యం జీవిని రసవంతునిగా, చైతన్యవంతునిగా చేసి సజీవంగా నిలుపుతుంది. అందమంటే ఏమిటో, ఆనందం అంటే ఏమిటో మనిషికి రుచిని – అభిరుచిని రసవంతమైన రచనల ద్వారా తెలియజేస్తుంది. సాహిత్యం సమాజంలో ఆంతరికంగా ప్రవహించే ఒక జీవశక్తి.

సాహిత్యం ప్రధానంగా లోకహితాన్ని అనేకమైన నిజాలు, కాల్పనిక ఉదాహరణల ద్వారా సమాజానికి అందిస్తుంది. లోకహితంలో వ్యక్తిహితం కూడా దాగి ఉంటుందనే విషయాన్ని విశదం చేస్తుంది. మనిషిని, సమాజాన్ని కేంద్రం చేసుకొని వివిధ రూపాల్లో వివిధ ప్రక్రియల ద్వారా బోధిస్తుంది. సాహిత్యానికి మానవత్వం ప్రధానం.

వివిధ కోణాల్లో సాధకులు సాధనల్ని, విజేతల విజయాల్ని వాటిద్వారా ఆశావాదాన్ని ప్రేరేపించి ప్రోత్సహిస్తుంది. వ్యక్తిలో సామాజిక భావాలను పెంపొందించి సామ్యవాదానికి, ప్రజాస్వామ్యానికి అండగా నిలుస్తుంది. కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ, వ్యాసం.... ఇలా వివిధ ప్రక్రియల ద్వారా ‘విలువలను’ ప్రతిపాదిస్తుంది.ప్రచారంలోనికి తెస్తుంది.


సాహిత్యం మానవ విలువలకు,మమత, సమత భావాలకు దోహదం చేసి వ్యక్తిని సభ్య పరచి, వ్యవస్థల్ని మెరుగుపరుస్తుంది. సాహిత్యానికి చెందిన భాష అంతా అందంగా, ఆనందంగా, సున్నితంగా, సుకుమారంగా వినేవారికి, చదివేవారికి ఎంతో మనోహరంగా హృదయాహ్లాదంగా ఉంటుంది. అందుకనే సాహిత్య సంబంధమైన భాషను ‘రసభాష’గా వ్యవహరిస్తారు. నవరస సంబంధమైనదిగా ప్రయోగింప బడుతుంది. అందులోనూ కవులు, రచయితలు జీవితానుభవాలను తమ రచనల్లో నిక్షిప్తంచేస్తారు. కనుకనే మనిషిని పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దటానికి కారణమవుతుంది. సాహిత్యం మనిషిని దేశవిదేశాల్లో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో మాట్లాడటానికి ఆస్కారం కలిగిస్తుంది. సంభాషణల్లో మంచి సామెతల్ని, నుడికారాల్ని, జాతీయాల్ని, చమత్కారాల్ని అందిస్తుంది. సాహిత్య భాష ఏదైనా సంక్షిప్తంగా,అందంగా వ్యక్తీకరించటానికి ఉపయోగపడుతుంది.

ఏ వృత్తిలో ఉన్నా ప్రవృత్తిలో కొంత సాహిత్య అధ్యయనం కూడా అవసరమే. ఏ భాష, సాహిత్యం అన్నది ప్రధానం కాదు. తెలుగు కావచ్చు, ఇంగ్లీష్ కావచ్చు. తనకు నచ్చిన వచ్చిన భాష కావచ్చు. వివిధ ప్రక్రియల్లో ఏది తనకు ఇష్టమో అది కావచ్చు. ఏదేమైనా సాహిత్యం మనిషి జీవితానికి అనివార్యమైంది. మనిషిని ప్రతిభావంతునిగా, వినయ వంతునిగా, వికాసవంతునిగా వివేకవంతునిగా తీర్చిదిద్దడానికి సాహిత్యం సృష్టింపబడుతుంది. సాహిత్యం ఉద్దేశమే అది. అందుకనే సమాజాన్ని ఎన్ని కోణాల్లో విశ్లేషించాలో, అన్ని కోణాల్లోనూ చర్చిస్తుంది. మెరుగైన సమాజాన్ని ఆకాంక్షిస్తోంది. మెరుగైన సమాజాన్ని ఆకాంక్షిస్తుంది. మంచి భాష,సాహిత్యాభిరుచిని కలిగి ఉండి తీర్చిదిద్దుకోవడం నేటి తరానికి ఎంత అవసరమో తర్వాతి తరానికి అందించటం కూడా అంతే అవసరం.

# "I'm OK, You're OK" పుస్తకం



మన జీవితంలో చాలా పుస్తకాలు చూస్తుంటాము, కొన్ని చదువుతాము మరికొన్ని మరలా మరలా చదువుతాము, అలాంటి పుస్తకాలు మన జీవితానికి మార్గదర్శకాలుగా, మార్గనిర్దేశాలుగా చాలా ప్రభావాన్ని చూపుతాయి. నా జీతంలో అలాంటి పుస్తకం "'I'm OK, You're OK" ఈ పుస్తకం ప్రతీ ఇంట్లో పుస్తకాల అరలో తప్పక ఉండాల్సిన అపురూప కావ్యం. ఇది స్వయం సహాయక సూచనల పుస్తకంగా పేరొంది 15 మిలియన్ కాపీలు అమ్ముడుపోయి, సుమారు 12 భాషలలో తర్జుమా చేశారు, బహుశా చరిత్రలో అత్యంత విజయవంతమైన పుస్తకం ఇది. ఈ పుస్తక రచయిత థామస్ అంథోని హ్యారిస్, ఒక మానసిక వైద్యుడు.. ముఖ్యంగా రచయిత తన దగ్గర చికిత్స తీసుకున్న ఎంతోమందితో జరిగిన సంభాషణలు మరియు వారి జీవితంలో ఎదుర్కొన్న సమస్యలను విన్న తరవాత ఈ పుస్తకం 1967 ఒక రూపుదాల్చుకుంది. ఇది సమాజంలో చాలా సరళమైన సంభదాలు తెలిపే నమూనాను అందిస్తుంది.




మనిషి పుట్టిన దగ్గరనుంచి చాలా సంఘర్షణలకు లోనవుతూ ఉంటాడు, చిన్నప్పుడు కొన్ని భయాలు భ్రమలతో, కొంత ఎదిగాక బాధ్యతలతో ఇంకా పెద్దయ్యాక బంధాలతో నిరంతరం విస్తుపోతూ అనేకానేక భావోద్వేగాలకు లోనవుతూ ఇవన్నీ నాకే ఎందుకు జరిగాయని, నేను సరిగాలేను అని అంథోళన చెందుతుంటాడు. చిన్నప్పుడు తొందరగా పెద్దవ్వలని ఏవిధమైన భయాలు లేకుండా ఆనందంగా జీవించాలని, అలాగే పెద్దయ్యాక చిన్నప్పుడే బాగుందని ఈ బాధ్యతలు భావోద్వేగాలు బాల్యంలో లేవని ఆలోచిస్తూ జీవితాన్ని ముందుకు నెట్టేస్తూ ఉంటాండు, ఈ జీవన విధానంలో మనం ప్రస్తుతాన్ని అనుభవించలేకపోతున్నాము, ఈ పుస్తకంలో రచయిత Transactional అనాలిసిస్ గురించి విశ్లేషిస్తారు, అంటే ఇది ఒక మానసిక విశ్లేషణా సిద్ధాంతం. రచయిత వ్యక్తి ప్రవర్తనా రీతులు 3 రకాలుగా ఉంటాయని అవి పేరెంట్ (Px), అడల్ట్ (A) ) మరియు చైల్డ్ (C) అని వివరించారు. ఇక్కడ P అంటే పేరెంట్ గనుక ఎక్కువ contamination అయితే పక్షపాతదొరణి, మూస ఆలోచనలతో ఉంటారు. అలాగే P ఆధిపత్యంవున్న వ్యక్తులు సంప్రదాయ, దైవభక్తి, ఆచారాలకు కట్టుబడి ఒక నిర్దిష్టమైన మార్గంలో ఉంటారు. ఇలా చైల్డ్ వ్యక్తిత్వం నెగెటివిటీ ఉంటే భయాలు, భ్రాంతులు, ఆత్మనున్యత కొన్ని ఫోబియాస్ ఉంటాయి, అదే వ్యక్తి పాజిటివ్ వైపు ఉంటే ఆనందగా, సృజనాత్మకతతో మరియు పట్టుదలతో ఉంటారు. ఇలా చెప్పుకుంటూ పోతే కొన్ని రోజులు సరిపోవు. చదివినకొద్దీ కొత్తగా అర్ధమవుతూ ఉంటుంది, అంటే పాఠకుడు చదివిన ప్రతీసారి తన దృష్టి కొన్నాన్ని సానపెడుతుంది, అదే కదా మంచి పుస్తకం యొక్క గొప్పదనం.

చివరగా ఒక్కవిషయం చెపుతాను ఈ పుస్తకం మీతోపాటు ఉంటే సమాజంలో మన సంభదాలు, ఇతరులతో సంభాషణలు, ఎదుటవారిని ఎలా అర్ధంచేసుకోవాలి, అసలు మన జీవితంలో జరిగే వివిధ అనుభవాలు, ముఖ్యంగా మనల్ని ఇష్టపడేవారిని లేదా ద్వేషించేవారిని ఎలా స్వీకరించాలో చెపుతూ మీ జీవితగమ్యాన్ని నిర్దేశిస్తుంది ఈ పుస్తకం. అంటే మనుష్యుల ప్రవర్తనా తీరును తెలుసుకోడానికి వారి హృదయాంతరాళాల్లోనికి తీసుకుపోతుంది ఈ పుస్తకం. అతిశయోక్తి కాదు ఇది ఒక మతగ్రంథమే.

-డా.నారాయణ నక్కిన


# నూతన విద్యావిధానంలో పరిశోధనలకు ప్రాధాన్యం

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు




**03.02.21 (మీడియాసెల్)** నూతన విద్యా సంవత్సరంలో పరిశోధనలకు అధిక ప్రాధాన్యతనివ్వడం జరిగిందని కళాశాలలు వాటిని అనుసరించి పరిశోధనలకు పెద్దపీట వేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాల లకు నూతన విద్యా సంవత్సరం 2020–21 పాఠ్యాంశాలపై అవగాహన సదస్సును విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్లో బుధవారం నిర్వహించారు. యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. భారతదేశ వ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించాలని, పరిశోధన, నైపుణ్యాల దిశగా విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని నూతన విద్యా సంవత్సరాన్ని ప్రవేశపెట్టారని దానిని ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకు వెళ్ళాల్సిన బాధ్యత కళాశాలలపై ఉందని అన్నారు. కళాశాలల్లో నాణ్యమైన అధ్యాపకులు, వసతులను ఏర్పాటు చేయాలని నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న మార్గదర్శకాలను అనుసరిస్తూ విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రకారం ఈ ఏడాది నుండి 4 సంవత్సరాల డిగ్రీ కోర్సును అందుబాటు లోనికి తీసుకొస్తున్నామని చెప్పారు. దీనిలో సాధరణ డిగ్రీతో పాటు లైఫ్ స్కిల్ కోర్సులు, స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు పాఠ్యాంశాలు, తరగతుల నిర్వహణ, ప్రాజెక్టులు, క్రెడిట్లను వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ కు, విభాగాధిపతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ డా.ఎం. కమలకుమారి, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.ఎం.గోపాలకృష్ణ, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డా.ఎం.శ్రీధర్ విశ్వ విద్యాలయ అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

## మంచి మాట






## జియాలజీలో అవకాశాలను అందిపుచ్చుకోండి

### పాఠ్యాంశాలను బోధించిన వీసీ జగన్నాథరావు




పాఠ్యాశాలను బోధిస్తున్న మొక్కా జగన్నాథరావు


**05.02.21 (మీడియాసెల్)** జియాలజీలో ఎక్కువ ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకొనే విధంగా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. జియాలజీలో అపార అనుభవం కలిగిన మొక్కా జగన్నాథరావు నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా విధులు నిర్వహిస్తూ ఆచార్యునిగా జియాలజీ విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. శుక్రవారం యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల భవనంలోని జియాలజీ విభాగాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులతో, అధ్యాపకులతో మమేకమయ్యారు. దేశ విదేశాలలో జియాలజీ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొనేందుకు అవసరమైన మార్గాలను సూచించారు. జియాలజీపై పట్టు సాధించడం వలన కలిగే ప్రయోజనాలను తద్వారా లభించే అవకాశాలను క్షుణంగా వివరించారు. భూవనరులు, జియలాజికల్ టైమ్ స్కేల్, జియాలజీ అప్లికేషన్ తదితర అంశాల ఆయన బోధించారు. ఇన్విరాల్మెంట్ జియాలజీస్ట్, మైనింగ్ జియాలజీస్ట్, పెట్రోలియం జియాలజీస్ట్ మధ్య వ్యత్యాసాలను తెలియజేసారు. విద్యార్థులంతా ప్రతీరోజు తమతమ పాఠ్యాంశాలలో నుండి కొత్త విషయాలను అధ్యయనం చేసి నిద్రపోవాలనే నిబంధనను పెట్టుకొని పాఠ్యాంశాలపై పట్టుసాధించాలన్నారు. పాఠ్యాంశాల బోధన అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి దానిలో సరైన సమాధానాలు ఇచ్చిన విద్యార్థులకు పుస్తకాలను బహూకరించి ప్రోత్సహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతిగా కాకుండా ప్రముఖ జియాలజీ ఆచార్యులుగా విద్యార్థులకు, అధ్యాపకులకు క్లాస్ తీసుకున్న మొక్కా జగన్నాథరావును జియాలజీ విభాగాధిపతి డా.కె.నూకరత్నం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.వి.స్వామి, డా.కె.సామ్యుల్ పీటర్ విభాగాధ్యాపకులు పాల్గొన్నారు.



### ప్రొడక్టివ్ వర్క్ విధానాన్ని ఆచరిస్తాం

వీసీ సూచించిన ప్రొడక్ట్‌వర్క్ విధానం చాలా బాగుంది. దీనిని ఆచరిస్తే మంచి ఫలితాలు వస్తాయి. ప్రతిరోజూ ఏం సాధించామనేది నెమరువేసుకోవడం ద్వారా మరింత విజ్ఞానం పెంపునకు ఉపయోగపడుతుంది. నిత్యజీవితంలో ఆచరించ యోగ్యమైన సూత్రమని భావిస్తున్నాను. **–వి ఎఫ్ బి శిరీష, ఫైనల్ ఇయర్ జియో ఫిజిక్స్**

### భూ వనరులపై చక్కని విశ్లేషణ



భూవనరులపై వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు చెప్పిన పాఠ్యాంశం చాలా చక్కని విశ్లేషణగా ఉంది. భూ వనరులకు సంబంధించిన అన్ని అంశాలు దీనిలో కవర్ చేసారు. జియాలజీలోని నూతన అంశాలను ప్రస్తుత పరిస్థితులకు తగినట్టుగా చక్కగా వివరించారు. ఎన్విరాన్మెంటల్, మైనింగ్, పెట్రోలియం జియాలజిస్ట్ ల మధ్య వ్యత్యాసాలు బాగా అర్థమయ్యాయి. **–డి.వి.బి.వి.నాయుడు, సెకండ్ ఇయర్ జియాలజీ**



### వీసీ స్వయంగా పాఠాలు చెప్పడం బాగుంది

వీసీ స్వయంగా మా క్లాసుకు వచ్చి పాఠం చెప్పడం చాలా బాగుంది. జియాలజీ విభాగంలో ఆచార్యులుగా అపార అనుభవం కలిగిన ఆయన అనుభవాలను మాకు వివరించారు అవి మాకెంతో ప్రోత్సాహంగా ప్రోత్సాహకరంగా ఉన్నాయి. జియాలజీ లో పరిశోధన దిశగా అవి మమ్మల్ని ఎంతో ప్రేరేపించాయి. **–టి. భారతి దేవి, ఫస్ట్ ఇయర్ జియో ఫిజిక్స్**


### కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరాన్ని తెలియజేశారు



పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ పాత్ర చాలా అధికమని అర్థమైంది. ఏ రంగంలో ఉద్యోగం సాధించాలన్నా కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా మారాయి. జియాలజీ పాఠశాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాధాన్యతను వివరించారు.

**– ఐ సి పి కుమార్, ఫస్ట్ జియో ఫిజిక్స్**

### వీసీ పాఠం విద్యార్థులకు ప్రోత్సాహం



వీసీ చెప్పిన జియాలజీ పాఠ్యాంశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆవశ్యకతలు విద్యార్థులందరికీ ఎంత ఉపయోగపడతాయి. పాఠ్యాంశాలు బోధించిన తర్వాత ప్రశ్నలు అడిగి వాటికి సరైన సమాధానాలు చెప్పిన వారికి పుస్తకాలను బహూకరించి ప్రోత్సహించారు. ఆ విధంగా సరైన సమాధానం చెప్పి నేను ఒక పుస్తకాన్ని బహుమతిగా అందుకున్నాను. జియాలజీ కాంపిటేటివ్ పాఠ్యాంశాలకు సంబంధించి వీసీ స్వయంగా వ్రాసిన ఈ పుస్తకం ఎంతో ఉపయోగంగా ఉంది. **–ఎన్ లాస్య, ఫస్ట్ జియాలజీ**

## 'వినిమయ' లెక్చర్ క్లబ్‌తో విజ్ఞాన వికాసం

**06.02.21 (మీడియాసెల్)** ఎక్కువ విజ్ఞాన శాఖలకు సంబంధించిన పరిశోధనాంశాలను ఒక వేదికపైకి తీసుకురావడానికి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విజ్ఞానాన్ని వికసింపచేయడానికి "వినిమయ" లెక్చర్‌క్లబ్‌ను ఏర్పాటు చేసామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయం కన్వేన్షన్ సెంటర్‌లో శనివారం "వినిమయ" అనే పేరుతో లెక్చర్ క్లబ్‌ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా విజ్ఞాన, వికాస కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని విజ్ఞాన వికాసకేంద్రంగా తీర్చిదిద్దేందుకు వినిమయ లెక్చర్‌క్లబ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ లెక్చర్‌క్లబ్‌లో నెలకు రెండు పర్యాయాలు విశ్వ విద్యాలయ ఆచార్యులు తమ పరిశోధ నాంశాలపై లెక్చర్‌ను అందిస్తారని తెలిపారు. ఎక్కువ విజ్ఞాన శాఖలకు సంబంధించిన



ఉపన్యసిస్తున్న ఆచార్య ఎస్.టేకి

పరిశోధనాంశాలు భవి పరిశోధకులు, అధ్యాపకులు తెలుసుకొని సృజనాత్మక పరిశోధనలవైపు అడుగులు వేసేందుకు ఈ లెక్చర్ క్లబ్ ఉపయోగ పడుతుందని తెలియజేసారు. బోధన, పరిశోధన, మంచి సాధన తదితర అంశాలపై ఆసక్తిని పెంచేందుకు యువతరాన్ని ప్రోత్సహించేందుకు లెక్చర్‌క్లబ్‌లు మార్గదర్శకాలుగా ఉంటాయన్నారు. లెక్చర్ క్లబ్ కోఆర్డినేటర్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని విద్యాపరంగా, పరిశోధనపరంగా అభివృద్ధి చేసేందుకు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

ప్రవేశపెట్టిన బృహత్తర కార్యక్రమం వినిమయ లెక్చర్ క్లబ్ అని తెలిపారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విశ్వవిద్యాలయాన్ని పరిశోధన ప్రగతివైపు నడిపించాలనే వీసీ ఆలోచనలను సాకారం చేయాలని తెలియజేసారు. వినిమయ లెక్చర్ క్లబ్‌లో తొలి లెక్చర్‌ను సూక్ష్మఆర్థిక విధానం అనే అంశంపై యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ మేనేజ్మెంట్ ఆచార్యులు ఎస్.టేకి అందించారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలలో ప్రధానంగా దరిద్రం, కాలుష్యం, ఉగ్రవాదమని వాటిని నియంత్రిస్తే దేశాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. స్థానిక వనరులను ఉపయోగించుకుంటూ పేద ప్రజలు, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉన్న మార్గాలను ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆచార్యులు, అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.


## నానోమెటీరియల్స్‌పై అధ్యయనాలు పెరగాలి

**03.02.21 (మీడియాసెల్)** ఆధునిక సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో నానో మెటిరియల్స్‌పై అధ్యయనాలు మరింత పెరగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో "అడ్వాన్సెస్ ఇన్ నానోమెటిరియల్స్ అండ్ సింగిల్ క్రిస్టల్స్ ఫర్ ప్రాక్టికల్ డివైస్ అప్లికేషన్స్" అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ను డిపార్టమెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో డా.ఎస్.రాజ్యలక్ష్మి కన్వీనర్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. నానోటెక్నాలజీ దశాబ్దాలుగా అందరి దృష్టిని ఆకర్షిస్తుందని భవిష్యత్ తరాల సెన్సింగ్ సాధనాల అభివృద్ధికి ప్రత్యేకమైన అవకాశాలను అందిస్తుందన్నారు. ఇంజినీరింగ్ నానోపార్టికల్స్ ఉపయోగించి జీవఅణువులను ఎన్నుకోవటానికి పాయింట్ ఆఫ్ కేర్ పరికరాలు రోగనిర్ధారణ రంగంలో ప్రధాన పరిశోధనగా మారాయని చెప్పారు. వైద్య విజ్ఞాన శాస్త్రంలో సూక్ష్మ పదార్థాలు ముఖ్యమైన

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

పాత్రలను పోషిస్తున్నాయని తెలిపారు. సూక్ష్మ సున్నితమైన బయోసెన్సార్‌లు నుండి పొందిన నానో మెటీరియల్స్ నిజమైన సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని అన్నారు. వివిధ వ్యాధులతో సంబంధం ఉన్న అరుదైన పరమాణు, జన్యు సంకేతాలను ముందుగా గుర్తించడానికి ఇవి చాలా అవసరమని చెప్పారు. నానో సాంకేతికతపై మరిన్ని అధ్యయణాలు జరిగి మెరుగైన ఫలితాలను తీసుకురావాల్సిన బాధ్యత భవిపరిశోధకులపై ఉందన్నారు. నానోమెటిరియల్స్‌కు సంబంధించిన అనేక అంశాలపై తమిళనాడుకు చెందిన నానోసైన్సెస్ అధ్యాపకులు డా.జి.రామలింగం, చెన్నై రిసెర్చ్ సైంటిస్ట్ డా.మత్తు సింతిల్ పాండియన్ వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, యూజీసీ కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల, కోకన్వీనర్లు వై.సుష్మప్రియ, ఎన్.ఎస్.సుబ్బరావు, వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెంచ్ దౌత్యవేత్తలతో ఉన్నత విద్యపై సమావేశం



**06.02.21 (మీడియాసెల్)** ఫ్రెంచ్ దౌత్యవేత్తలతో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య ప్రోత్సాహంపై ఆన్‌లైన్ సమావేశం జరిగిందని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్యను ప్రోత్సహించడం" అనే అంశంపై ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు, అధికారులు, ఆచార్యులు హాజరైయ్యారు. దీనిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై సమావేశానంతరం వివరాలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్య ప్రవేశాలు, పరిశోధనలు, ప్రోజెక్టులు తదితర అంశాలలో ఫ్రాన్స్ విద్యార్థులకు అవకాశాలపై ఫ్రాన్స్ దౌత్యవేత్త అధికారులు చర్చించారని చెప్పారు. ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ, నాక్ గుర్తింపు వంటి అంశాలపై యాప్షీ చైర్మన్ ఆచార్య హేమచంద్రరెడ్డి పలు సూచనలు చేశారని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లెర్నింగ్ మేనేజమెంట్ సిస్టమ్ ద్వారా ఎక్కువ పాఠ్యాంశాలను ఈ-కంటెంట్ రూపంలో ఆన్‌లైన్‌లో పొందుపర్చినందుకు అభినందించారని చెప్పారు. విశ్వవిద్యాలయ సమాచారాన్ని క్రమబద్ధికరించేందుకు సాఫ్ట్‌వేర్‌ను తీసుకొస్తున్నట్లు, పర్మినెంట్ పోస్టుల భర్తీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమావేశంలో తెలియజేశారని వీసీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఆచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రవేశ సంచాలక కార్యాలయం

## ( Directorate of Admissions )









విశ్వవిద్యాలయంలోను, ఉభయగోదావరి జిల్లాలలోని అన్ని పి.జి. సెంటర్లలో విద్యా ప్రవేశాలను నిర్వహించే వ్యవస్థయే - డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్.



## త్వరలో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు

ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరం ప్రవేశాల్లో భాగంగా (నన్నయ సెట్ 2020) మూడవ దశ ప్రవేశాలు, స్పాట్ అడ్మిషన్స్ పూర్తిచేసే పనిలో ఉన్నాం. పిహెచ్.డి. పరిశోధక విద్యార్థుల ప్రవేశాలు (ఎగ్జిక్యూటివ్ కోటా) అలాగే త్వరలో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయి.

**- డాక్టర్ డి.జ్యోతిర్మయి డైరెక్టర్ - డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్.**

## కార్య నిర్వహణ

- నన్నయ సెట్ నిర్వహణ (ప్రవేశ పరీక్ష)
- ఫలితాల ప్రకటన, ర్యాంకులు
- కౌన్సెలింగ్,యోగ్యతాపత్రాలు పరిశీలన,వెబ్ ఆప్షన్స్
- కేటగిరి (రిజర్వేషన్స్)ప్రకారం విద్యార్థుల ప్రవేశాలు
- స్పాట్ అడ్మిషన్స్ (ఉభయ గోదావరి జిల్లాల్లోని కళాశాలల్లో స్పాట్ మరియు మేనేజ్మెంట్ సీట్లు రాటిఫికేషన్)
- తుది ప్రవేశాల పట్టికను అందించుట.
- ఎడ్యుకేషన్ కళాశాలల్లో జరిగిన అడ్మిషన్ల రాటిఫికేషన్, స్పాట్ అడ్మిషన్స్
- ఎమ్.బి.ఏ.,ఎమ్.సి.ఏ. స్పాట్ అడ్మిషన్స్
- న్యాయశాస్త్ర (లా)కోర్సుల అడ్మిషన్స్, రాటిఫికేషన్స్.
- విశ్వవిద్యాలయ అనుబంధ పరిశోధన కేంద్రాల పిహెచ్.డి.అడ్మిషన్స్






డాక్టర్ కె. వి.స్వామి, అసోసియేట్ డైరెక్టర్



డాక్టర్ కె. దీప్తి, అసోసియేట్ డైరెక్టర్





ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in